మేడ్చల్‌లో వర్షం



కిష్టాపూర్‌లో కురుస్తున్న వర్షం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో, మండలంలోని గ్రామాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత ఉండగా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీచాయి. సుమారు గంటకుపైగా ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో రైతన్నలు ఇబ్బందులు పడ్డారు. ఆరబోసిన వరి ధాన్యం తడవకుండా ఉండేందుకు అవస్థలు పడ్డారు. గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గంటపాటు కుమ్మేసింది...

కీసర: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈదురు గాలులతో గ్రామాల్లోని మామిడి పండ్ల తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. కొన్ని చోట్ల వరి పంటలు కొంత మేర దెబ్బతిన్నాయి. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో వివిధ కాలనీల రహదారులు చిత్తడిగా మారాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే అధికారులు సరఫరాను పునరుద్ధరించారు. దాదాపు గంట పాటు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

అక్రమ కట్టడాలపై కమిషనర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని కోరుతూ స్థానికుడు మల్లేశ్‌యాదవ్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి గురువారం ఫిర్యాదు చేశాడు. ఎన్ఎఫ్‌సీనగర్‌లోని సొసైటీకి చెందిన భూమిలో బైనంబర్ ప్లాటులో ఇంటిని నిర్మిస్తున్నారని లేఖలో ఆరోపించారు. కమిషనర్ స్పందించి అక్రమ కట్టడాన్ని ఆపాలని కోరారు.

డెంగీని తేలిగ్గా తీసుకోవద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి

అల్వాల్: డెంగీని తేలిగ్గా తీసుకోవద్దని, వ్యాధిని గుర్తించపోతే ప్రాణాలు పోయే అవకాశం ఉందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడెస్ దోమల ద్వారా డెంగీ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయకపోతే ప్రాణాంతకమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఫ్రైడేను డ్రై డేగా పాటించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ నారాయణరావు, డాక్టర్ గీతాప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ పద్మావతి, ఆరోగ్య కేంద్రం వైద్యులు కపూర్, డాక్టర్ రాజమల్లు, లింగాల అక్షయ్‌కుమార్, సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.


యువతి అదృశ్యం



పావని(ఫైల్)

మేడ్చల్‌రూరల్: బర్త్ డే పార్టీకి వెళ్తున్నా అని ఇంట్లో నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన తాడికొండ జయమ్మ–నూకయ్య దంపతులు కూతురు పావనితో కలిసి నివాసం ఉంటున్నారు. పావని(20) డబిల్‌పూర్ గ్రామ పరిధిలో ఉన్న ఇన్ఫోటెక్ కంపెనీలో పనిచేస్తోంది. ఈ నెల 13న ఉదయం స్నేహితురాలి బర్త్‌డే పార్టీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఎంతకీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి జయమ్మ మేడ్చల్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



పోచారం: వడదెబ్బతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మాయిల్‌ఖాన్ గూడలోని సాయితేజకాలనీలో గురువారం ఉదయం రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి తిరుగుతూ కాలనీవాసులకు కనిపించాడు. అదేరోజు సాయంత్రం ఆ వ్యక్తి రోడ్డుపై చలనం లేకుండా పడిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించి 108 అంబులెన్స్ వాహనానికి ఫోన్ చేశారు. అతడిని 108 సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు యాచకుడై ఉండవచ్చని, సమయానికి అన్నపానీయాలు అందక, అనారోగ్యంతో పాటు వడదెబ్బకు చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



మేడ్చల్‌రూరల్: డీసీఎం వ్యాన్– ట్రాలీ ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం నగరంలోని బండ్లగూడకు చెందిన ఆటో డ్రైవర్ ఉప్పల నాగరాజు(40) గురువారం మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి దుండిగల్‌వైపు వెళ్తుండగా మార్గమధ్యలో అయోధ్య చౌరస్తా సమీపంలో ఆటోను డీసీఎం ఢీ కొట్టింది. రెండు వాహనాలు అతివేగంగా వెళ్లి ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ నాగరాజు ఆటో క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, వాహనదారులు 20 నిమిషాల పాటు శ్రమించి అతడిని బయటకు తీయగా తీవ్రగాయాల పాలైన నాగరాజు అప్పటికే మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

అక్రమ లే అవుట్లు..
అడ్డగోలు విక్రయాలు

పంట పొలాలను లే అవుట్లుగా చూపుతూ..

- అనుమతులు లేకుండా ప్లాట్లుగా మారుస్తూ..
- నాలుగు రాళ్లు పాతి.. ప్లాట్ల అమ్మకం
- రూ.కోట్లు దండుకుంటున్న రియల్టర్లు
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- కొనుగోలు చేస్తున్న అమాయక ప్రజలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



మైసమ్మగూడలో ప్లాట్లుగా మారిన వ్యవసాయ భూమి



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అడ్డగోలుగా అక్రమ లే అవుట్లు వెలుస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ కాసుల కక్కుర్తి కోసం ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యవసాయ భూముల్లో నాలుగు వైపులా నాలుగు హద్దురాళ్లు పాతి ప్లాట్లుగా మారుస్తూ వాటిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎకరం, రెండెకరాల పంట పొలాలకు గాను తెల్ల కాగితంపై నల్ల గీతలు గీసి లే అవుట్ పేరు చెబుతూ కనీస వసతులు సైతం కల్పించకుండా అమాయక ప్రజలు అమ్మకాలు జరిపి రూ.కోట్లలో వ్యాపారం సాగిస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సర్వే నంబర్ 568, 573, 574 సర్వే నంబర్లలో ఎకరం పైచిలుకు వ్యవసాయ భూమి ఉంది. ఈ స్థలాన్ని కొందరు రియల్ వ్యాపారులు చదును చేసి ప్లాట్లుగా మార్చి హద్దు రాళ్లు పాతారు. తెల్ల కాగితంపై లే అవుట్ నమూనా వేసి ప్లాట్ల కింద విక్రయించి సొమ్ము చేసుకున్నారు. గతంలోనూ ఈ గ్రామంలోని పలు సర్వే నంబర్లలో రియల్ వ్యాపారులు ఇదే తరహాలో వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మకాలు జరిపి రూ.కోట్లు గడించారు.

ఖాళీ స్థలాలకు డిమాండ్ ఉండటంతో..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలో మల్లారెడ్డి యూనివర్సిటీతో పాటు పదుల సంఖ్యలో ఇంజినీరింగ్, ఇతర ఉన్నత విద్య కళాశాలలు ఉండటంతో పెద్ద ఎత్తున విద్యార్థులు విద్యనభ్యసిస్తూ ఇక్కడే హాస్టళ్లలో నివాసం ఉంటారు. విద్యార్థుల కోసం పెద్ద ఎత్తున హాస్టళ్ల నిర్మాణాలు చేపడుతుండటంతో ఇక్కడ ఖాళీ స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. గజం భూమి విలువ రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకు పలుకుతుందంటే అతిశయోక్తి కాదు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు రియల్ వ్యాపారులు పంట పొలాలను ప్లాట్లుగా మార్చి కనీస వసతులు కల్పించకుండానే అమ్మకాలు జరుపుతూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

రియల్టర్లకు భారీగా ఆదాయం..

మైసమ్మగూడలో అక్రమ లే అవుట్ల కారణంగా రియల్ వ్యాపారులకు రూ.కోట్ల ఆదాయం వస్తుండగా మున్సిపల్ కార్యాలయ ఆదాయానికి గండి పడటమే కాకుండా ఖర్చులు పెరుగుతున్నాయి. వ్యాపారులు పంట పొలాలను ప్లాట్లుగా మార్చే సమయంలో కనీస వసతులైన డ్రైనేజీ, రోడ్లు, ఇతర వసతులు కల్పించకుండానే అమ్మకాలు జరిపి చేతులు దులుపుకోగా వాటిని కొనుగోలు చేసిన వారు సైతం అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఆ భవనంలో హాస్టల్ మొదలైన తర్వాత వాటిలో ఉండే విద్యార్థులకు నీటి వసతి, డ్రైనేజీ, రోడ్ల సమస్య తలెత్తుతోంది.

కన్నెత్తిచూడని అధికారులు

అక్రమ లే అవుట్లలో ఆదిలోనే ఆపాల్సిన అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడకపోవడం, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తుండటంతో అనంతరం సమస్యలు వచ్చినప్పుడు మున్సిపల్ కార్యాలయమే సమస్యల పరిష్కారానికి నిధులు వెచ్చించాల్సి వస్తోంది. మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లే అవుట్లు చేపడుతున్న వారిని అధికారులు నిలువరించకపోవడంతో పాటు భవిష్యత్‌లో ఆ లేఅవుట్లకు మున్సిపల్ వ్యయం వెచ్చించాల్సి వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ లే అవుట్లను నేలమట్టం చేస్తాం

మున్సిపల్ పరిధిలో అక్రమ లే అవుట్లను వదిలిపెట్టం.. వారికి ఇప్పటికే నోటీసులు అందజేశాం. మైసమ్మగూడలోని అక్రమ లే అవుట్‌లో తమ సిబ్బందితో హద్దురాళ్లు తీసేయించి నేలమట్టం చేస్తాం. మున్సిపల్ పరిధిలో ఎక్కడా అక్రమ లే అవుట్లు, వెంచర్లు చేసినా చర్యలు తప్పవు. కొనుగోలుదారులు సైతం అన్ని అనుమతులు ఉన్న ప్లాట్లనే కొనుగోలు చేయాలి. అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి భవిష్యత్‌లో ఇబ్బందులు పడొద్దు.

– రాములు, మున్సిపల్ కమిషనర్, గుండ్లపోచంపల్లి.

నగరానికి సమాంతరంగా మేడ్చల్ అభివృద్ధి

- ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలి
- జెడ్పీ సమావేశంలో చైర్మన్ శరత్ చంద్రారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగరానికి సమీపంలో ఉన్న మేడ్చల్ జిల్లా సమాంతర అభివృద్ధికి అందరూ సహకరించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మరింత కృషి చేస్తే శరవేగంగా ముందుకెళ్తామన్నారు. మేడ్చల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఉందన్నారు. ఇదే తరహాలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. జిల్లాలోని రైతులందరికీ రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయాన్ని పూర్తిగా రూ.33 కోట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. వానాకాలం రైతు భరోసా సాయం కూడా త్వరలో రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. చీర్యాలలో గతంలో అనుమతి లేకుండా నిర్మించుకున్న పేదల ఇళ్లను 14 శాతం పెనాల్టీతో రెగ్యులరైజ్ చేసి, ఇంటి నంబర్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సత్వరమే జీతాలు చెల్లిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా తడిసిన ధాన్యం కొంటామన్నారు. ఘట్‌కేసర్ సదరన్ క్యాంపు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సభలో జెడ్పీటీసీ, ఎంపీపీ, కో–ఆప్షన్ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమాధానం చెప్పించారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. విద్యార్థుల యూనిఫామ్‌లను మహిళా స్వయం సహాయక బృందాలతో కుట్టిస్తామని డీఆర్‌డీఏ సాంబశివరావు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివిధ శాఖల నుంచి 11,192 అనుమతులు ఇప్పించినట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం రవీందర్ తెలిపారు. కుటీర, చిన్న తరహా పరిశ్రమలకు 230 యూనిట్లకు అనుమతి ఇచ్చామన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద 373 యూనిట్లకు అనుమతి ఇచ్చామన్నారు. సమావేశంలో జెడ్పీ సభ్యులు బేస్త వెంకటేశం, హరివర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎల్లుబాయి, అనిత, మధుకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, డిప్యూటీ సీఈఓ నీరజ, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలి





కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: అన్ని రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేసేందుకే ఏక్ భారత్– శ్రేష్ట్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ చేపట్టిన ఏక్ భారత్– శ్రేష్ట్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులకు ముఖ్యంగా దేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, రాష్ట్రం ఏర్పడిన తీరుపై అవగాహన అవసరమన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే విద్యార్థులు దేశంలోని అన్ని ప్రాంతాల గురించి అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన 600 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొనగా వారిని బృందాలుగా విభజించి ఆయా రాష్ట్రాల పూర్తి సమాచారం అందించనున్నట్లు తెలిపారు. కల్చరల్ కార్యక్రమాలు, ఇరు రాష్ట్రాల విద్యార్థులు తమ రాష్ట్రాల గొప్పతనాన్ని చాటిచెప్పడం వంటివి వివరించనున్నారు. కార్యక్రమంలో కల్నల్ సంజయ్ గుప్తా, డోగ్రా, గ్రూప్ కమాండర్ అనిల్‌కుమార్, లెఫ్టినెంట్ కల్నల్ ఆనంద్‌రావు, శ్రీనివాస్, లెఫ్టినెంట్ దివ్య, జ్యోతి కుమారి, అమిత్, అన్షుల్ సక్సేనా, లలిత్ చౌదరి రాజేశ్‌సింగ్, రాచ్‌పాల్‌సింగ్, అశోక్, ఎన్‌వోస్ పాల్గొన్నారు.

4న విజయోత్సవ సభ జరుపుకుందాం

మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



ఈటల రాజేందర్‌తో నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, మేడ్చల్–మల్కాజ్‌గిరి ప్రజల ఆశీస్సులతో జూన్ 4వ తేదీన విజయోత్సవ సంబురాలు జరుపుకోవడం ఖాయమని బీజేపీ మేడ్చల్– మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నేతలు, సీనియర్ నాయకులు, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ కొన్ని రోజులు తన కోసం పనిచేసిన బీజేపీ కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, అక్కాల సురేష్, వేణుగోపాల్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



ఈటలతో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకులు

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎంపీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో పలు గ్రామాల నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా శామీర్‌పేట్‌లోని ఈటల నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ నివారణ కోసం అవగాహన ర్యాలీ

అల్వాల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంటమాలజిస్ట్ ఏఈ అనిల్‌కుమార్ ఆదేశానుసారం గురువారం అల్వాల్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను నీరు నిలవకుండా చూసుకోవాలని, శుభ్రత పాటించాలని, వారానికి తప్పనిసరిగా డెంగీ నివారణ కోసం సిబ్బందితో దోమల మందు పిచికారి చేయించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటమాలజిస్ట్ సిబ్బంది రాజు, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో పూర్తిగా ప్రభుత్వ భూములే ఉన్నాయని, అక్రమ నిర్మాణాలు చేస్తే సహించబోమని, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సిబ్బంది కాశీరాం, రవి, చాంద్‌పాషా పాల్గొన్నారు.

రైతుల జీవితాలను నాశనం చేస్తున్న ప్రభుత్వం

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



శామీర్‌పేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: రైతుల జీవితాలను రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఫైరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ నాయకులు రైతు సేవా సహకార సంఘాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసనలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సైతం ఖాతాలో డబ్బులు వేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అంటేనే కరువు అని, అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రైతుల ధాన్యాన్ని ఆఖరి గింజ వరకు కొనేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే రైతు ఉద్యమాలు మొదలవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై గరం.. గరం..

- జెడ్పీ సమావేశంలో వాడీవేడి చర్చ
- ధాన్యం కొనుగోళ్లు.. పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లించని తీరుపై సభ్యుల ఆగ్రహం
- జీపీల్లో పన్నుల వసూళ్లు.. ఇంటి నంబర్ల నిర్లక్ష్యంపై రగడ



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పంచాయతీల్లో.. ముఖ్యంగా ఘట్‌కేసర్ మండలంలోని పలు జీపీల్లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు, కొత్త భవనాలు, ఇళ్లకు అసెస్‌మెంట్, ఇంటి నంబర్ల కేటాయింపుల్లో నిర్లక్ష్యం, పన్నుల వసూళ్లలో చేతివాటం, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం తదితర సమస్యలపై జెడ్పీ సభలో పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన గురువారం జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రజాసమస్యలపై సభ్యుల వాగ్వాదాలు, వాడీవేడి చర్చలతో జెడ్పీ సమావేశం గరం.. గరంగా ముగిసింది.

అనుమతి లేని..

సభలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి(బీజేపీ) మాట్లాడుతూ ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ, ప్రతాపసింగారంతో పాటు పలు గ్రామ పంచాయతీల్లో అనుమతి లేకుండా వందల సంఖ్యలో భవనాలతో పాటు బహుళ అంతస్తులు వెలుస్తున్నా.. కార్యదర్శులతో సహా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, వివరాలతో కూడిన పత్రాలను సభలో జెడ్పీ చైర్మన్‌కు అందజేశారు. ఇదే పరిస్థితి మిగతా మండలాల్లో కొనసాగుతుందని ఆవేదన చెందారు. జెడ్పీ వైస్‌చైర్మన్ బేస్త వెంకటేశం మాట్లాడుతూ చీర్యాలలో పేదలు 60 గజాల్లోపు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేశారని, ఇప్పటికైనా వారికి న్యాయం జరిగేలా అదనపు పెనాల్టీతో క్రమబద్ధీకరించి, ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు. కొత్త ఇళ్లు, భవనాలకు ఇంటి నంబర్లు ఇవ్వడంతో పాటు అసెస్‌మెంట్ చేయడంలో కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. చీర్యాలకు సమర్థత కలిగిన కార్యదర్శిని నియమించాలని సూచించారు. సభలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ 14 శాతం అదనపు పెనాల్టీతో పేదలకు ఇంటి నంబర్లు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంసీపల్లి జెడ్పీటీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ చేసి పేదలకు స్థలం, ఇళ్లు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు నష్టపోయిన పేదలకు వారి నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు లేక..

కార్మికులకు 5 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో గ్రామ పంచాయతీలోనే పారిశుద్ధ్య పనులు స్తంభించి పోతున్నాయని, ఈ పరిస్థితి అన్నీ జీపీల్లో ఉందని ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆవేదన చెందగా, పలువురు సభ్యులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. పన్నులు వందశాతం వసూలు చేయడంతో పాటు అనుమతి లేని కట్టడాలపై చర్యలు తీసుకుంటే జీపీల్లో ఆదాయం పెరుగుతుందని, తద్వారా కార్మికులకు సకాలంలో జీతాలు అందించవచ్చని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంపై డీపీఓ వెంకయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు 91 శాతం పన్నులు వసూలు చేశామని, ఈ నెలాఖరులోపు మిగతా పన్నులు వసూలు చేస్తామన్నారు. సకాలంలో చెల్లించని వారికి పెనాల్టీ వేస్తామని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై..

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. గన్నీ బ్యాగులు లేవని, వర్కర్స్ అందుబాటులో ఉండటం లేదన్నారు. జెడ్పీ చైర్మన్ ఆదేశాలతో సివిల్ సప్లై జీఎం రాజేందర్ మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొంటున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి సంస్థ, సంక్షేమ శాఖలపై సభ్యులు చర్చించారు. ఇందులో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కో–ఆప్షన్ సభ్యులు, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ సీఈఓ నీరజతో సహా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387